## ఫోక్స్‌వ్యాగన్ గోల్ఫ్ జీటీఐ మాడల్

న్యూఢిల్లీ, మే 27: ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ ఫోక్స్‌వ్యాగన్...దేశీయ మార్కెట్‌కు మరో మాడల్‌ను పరిచయం చేసింది. నూతన గోల్ఫ్ జీటీఐ పేరుతో విడుదల చేసిన ఈ మాడల్ ధరను రూ.53 లక్షలుగా నిర్ణయించింది. ప్రీమియం విభాగాన్ని మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఈ నూతన వెర్షన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్టు ఫోక్స్‌వ్యాగన్ ఇండియా బ్రాండ్ డైరెక్టర్ నితిన్ కోహ్లీ తెలిపారు. 12.9 ఇంచుల ఇన్ఫోటైన్‌మెంట్ స్క్రీన్, 10.2 ఇంచుల డిజిటల్ కాక్‌పిట్, అన్ని కాలలను కంట్రోల్ చేసుకునే విధంగా టెక్నాలజీ, ఏడు ఎయిర్‌బ్యాగ్‌లు, లెవల్-2 అడాస్‌తో పాటు మరిన్ని ఫీచర్స్‌తో ఈ కారును తీర్చిదిద్దింది. కేవలం 5.9 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ మాడల్ గంటకు 250 కిలోమీటర్లు ప్రయాణించనున్నది.

# ఐటీ రిటర్నుల గడువు పెంపు

## సెప్టెంబర్ 15 వరకు పెంచిన సీబీడీటీ




న్యూఢిల్లీ, మే 27: ఆదాయ పన్ను చెల్లింపుదారులకు ఐటీ శాఖ శుభవార్తను అందించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను ఐటీ చెల్లింపులు గడువును సెప్టెంబర్ 15 వరకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నది. దీంతో అసెస్మెంట్ ఏడాది (ఏవై) 2025-26కిగాను జూలై 31 వరకు ఉన్న గడువును మరో నెలన్నర పెంచినట్టు అయింది. ఈ విషయాన్ని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు(సీబీడీటీ) ఒక ప్రకటనలో వెల్లడించింది. ఐటీఆర్‌లో మార్పులు చోటు చేసుకోవడం, యుటిలిటీ వ్యవస్థ అమలుకు అవసరమైన సమయాన్ని పరిగణనలోకి తీసుకున్న సీబీడీటీ ఐటీ గడువును పొడిగించింది. పన్ను చెల్లింపుదారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ఐటీ రిటర్నులు దాఖలు చేయడానికి ఐటీ శాఖ నిరంతరంగా కృషి చేస్తున్నదని, దీంట్లోభాగంగానే ఐటీ ఫామ్‌లో పలు మార్పులు చేసింది. ఈ నోటిఫై చేసిన ఐటీ ఫామ్‌తో చెల్లింపుదారులు సులభతరంగా, పారదర్శకతను పెంచడం, ఖచ్చితమైన సమాచారం అందించాలనే ఉద్దేశంతో సీబీడీటీ పలు మార్పులు చేసిన విషయం తెలిసిందే. ఐటీఆర్ ఫారాల నోటిఫికేషన్ జారీ ఆలస్యం కావడమే ఇందుకు కారణమని తెలిపింది. '2025-26 మదింపు సంవత్సరానికిగాను నోటిఫై చేసిన ఐటీఆర్ ఫారాల్లో చేపట్టిన మార్పులకు అనుగుణంగా టెక్నాలజీని అప్‌డేట్ చేయడానికి సమయం పట్టింది. పన్ను చెల్లింపుదారులు ఎలాంటి అవాంతరాలు లేకుండా రిటర్నులు ఫైల్ చేయడం కోసం ఈ గడువును పెంచినట్టు ఐటీ శాఖ తన ఎక్స్‌లో పేర్కొంది.

**రూ.50 లక్షల లోపు ఆదాయం..**

రూ.50 లక్షల లోపు ఆదాయం కలిగిన వ్యక్తిగత, హెచ్‌యూఎఫ్‌లు ఫామ్-1, 4తో ఐటీ రిటర్నులు దాఖలు చేయాల్సివుంటుంది. ప్రస్తుతం ఈక్విటీల నుంచి రూ.1.25 లక్షల వరకు దీర్ఘకాలిక మూలధన లాభాలు పొందిన సంస్థలు అటువంటి ఆదాయాన్ని ఐటీఆర్ 1, 4 ఫామ్‌లో చూపించుకోవచ్చును. గతంలో వీరు ఐటీఆర్-2ను దాఖలు చేయాల్సివుండేది. దీంతోపాటు 80సీ, 80జీజీ, ఇతర సెక్షన్ల కింద డిడక్షన్ క్లెయింకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం పలు మార్పులు చేసింది. సాధారణంగా, ఐటీఆర్ ఫామ్‌లను ప్రతీ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా నోటిఫై చేస్తుండగా, ఈసారి మాత్రం నూతన ఆదాయ పన్ను చట్టం ప్రవేశపెట్టడంతో ఆలస్యమైందని, దీంతో ఐటీ ఫామ్‌లలో భారీ మార్పులు చోటు చేసుకున్నాయని సీబీడీటీ వర్గాలు పేర్కొన్నాయి.

## భారీగా తగ్గిన పుత్తడి

న్యూఢిల్లీ, మే 27: గత నాలుగు రోజులుగా పెరుగుతూ వచ్చిన బంగారం ధరలు భారీగా తగ్గాయి. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాల ధరలు తగ్గుముఖం పట్టడంతో దేశీయంగా దిగొచ్చాయి. ఢిల్లీ బులియన్ మార్కెట్లో తులం బంగారం ధర రూ.800 దిగొచ్చి రూ.98,500గా నమోదైంది. ఈ విషయాన్ని ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ వెల్లడించింది. అలాగే 99.5 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల బంగారం ధర రూ.800 దిగొచ్చి రూ.98 వేలుగా నమోదైంది. బంగారంతోపాటు వెండి ధరలు కూడా భారీగా దిగొచ్చాయి. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు నిలిచిపోవడంతో కిలో వెండి రూ.1,370 తగ్గి రూ.99 వేలుగా నమోదైంది. ఔన్స్ గోల్డ్ ధర 45 డాలర్లు కరిగిపోయి 3,296.92 డాలర్లుగా నమోదైంది.

# కుప్పకూలాయి..

### 82 వేల దిగువకు సెన్సెక్స్ • 25 వేల కిందకు నిఫ్టీ

ముంబై, మే 27: స్టాక్ మార్కెట్ల వరుస ర్యాలీకి బ్రేక్‌పడింది. బ్యాంకింగ్, ఐటీ, వాహన రంగ షేర్లలో ప్రాఫిట్ బుకింగ్ జరగడంతో వరుసగా రెండు రోజులుగా పెరుగుతూ వచ్చిన సూచీలు భారీగా నష్టపోయాయి. ఒక దశలో వెయ్యి పాయింట్లకు పైగా నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 82 వేల పాయింట్ల దిగువకు పడిపోయింది. చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 624.82 పాయింట్లు కోల్పోయి 81,551.63 వద్ద స్థిరపడింది. 30 సూచీల్లో 25 షేర్లు నష్టపోగా,

కేవలం ఐదు సూచీలు లాభపడ్డాయి. మరో సూచీ ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 174.95 పాయింట్లు కోల్పోయి 24,826.20 వద్ద స్థిరపడింది. లాభాల్లో ప్రారంభమైన సూచీలకు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలు నష్టాల్లోకి నెట్టాయి. దీంతో ఇరు సూచీలు ఒక్క శాతానికి పైగా కోల్పోయి, చివర్లో భారీ నష్టాలను తగ్గించుకోగలిగాయి. పారిశ్రామి, తయారీ రంగ గణాంకాల విడుదలకుముందు మదుపరులు ముందస్తుగా అమ్మకాలకు మొగ్గుచూపడం సూచీల నష్టాలకు ప్రధాన కారణమని దలాల్‌స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి. బుధవారం పారిశ్రామిక, తయారీ రంగ గణాంకాలతోపాటు ఈ వారం చివర్లో దేశ జీడీపీ గణాంకాలు కూడా విడుదలకానున్నాయి. సూచీల్లో అల్ట్రాటెక్ సిమెంట్ గరిష్ఠంగా 2.21 శాతం నష్టపోయి టాప్ లూజర్‌గా నిలిచింది. దీంతోపాటు ఐటీసీ 2 శాతం, టాటా మోటర్స్, ఎన్‌టీపీసీ, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌సీఎల్, మహీంద్రా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్‌లు నష్టపోయాయి. కానీ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, సన్‌ఫార్మా, అదానీ పోర్ట్స్, నెస్లె, ఏషియన్ పెయింట్స్‌లు మాత్రం కోలుకున్నాయి. దేశీయ స్టాక్ మార్కెట్లు తీవ్ర ఊగిసలాటలో కదలాడాయని, ఆసియా మార్కెట్లు బలహీనంగా ఉండటం సూచీల పతనానికి కారణమైందని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. రంగాలవారీగా ఎఫ్ఎంసీజీ, ఐటీ, వాహన, బ్యాంకింగ్, యుటిలిటీ, మెటల్ రంగ షేర్లు పతనం చెందాయి.

## బీఎస్ఎన్ఎల్ లాభం 280 కోట్లు

న్యూఢిల్లీ, మే 27: ప్రభుత్వరంగ టెలికాం సంస్థ బీఎస్ఎన్ఎల్ మరోసారి లాభాల్లోకి వచ్చింది. వరుసగా రెండోసారి మార్చితో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.280 కోట్ల నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో సంస్థ రూ.849 కోట్ల నష్టాన్ని నమోదు చేసుకున్న విషయం తెలిసిందే. 18 ఏండ్ల తర్వాత వరుస త్రైమాసికాల్లో లాభాలను ప్రకటించడం ఇదే తొలిసారని కేంద్ర టెలికాం మంత్రి జ్యోతిరాదిత్యా సింధియా తెలిపారు. 2007 తర్వాత వరుస త్రైమాసికల్లో లాభాలను నమోదు చేసుకోవడం విశేషమన్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలోనూ సంస్థ రూ.262 కోట్ల లాభాన్ని గడించిన విషయం తెలిసిందే. కస్టమర్లకు మెరుగైన సేవలు అందించడం, ప్రభుత్వ సహాయ సహకారాలు అందించడం వల్లనే లాభాల్లోకి రాగలిగామని బీఎస్ఎన్ఎల్ సీఎండీ ఏ రాబర్ట్ జే రవి తెలిపారు.

# ఎల్ఐసీ లాభం 19,013 కోట్లు

### క్యూ4లో 38 శాతం పెరిగిన ప్రాఫిట్

న్యూఢిల్లీ, మే 27: దేశీయ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎల్ఐసీ) అంచనాలకుమించి రాణించింది. గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికానికిగాను సంస్థ రూ.19,013 కోట్ల నికర లాభాన్ని గడించింది. 2023-24 ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.13,763 కోట్లతో పోలిస్తే 38 శాతం వృద్ధిని కనబరిచినట్టు పేర్కొంది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.2,50,923 కోట్ల నుంచి రూ.2,41,625 కోట్లకు తగ్గింది. దీంట్లో తొలి-ఏడాది ప్రీమియం వసూళ్లు రూ.13,810 కోట్ల నుంచి రూ.11,069 కోట్లకు తగ్గినట్టు బీఎస్ఈకి సమాచారం అందించింది. అలాగే రెన్యూవబుల్ ప్రీమియం వసూళ్లు రూ.77,368 కోట్ల నుంచి రూ.79,138 కోట్లకు పెరిగాయి. మరోవైపు, గడిచిన ఆర్థిక సంవత్సరం మొత్తానికి రూ.8,84,148 కోట్ల ఆదాయంపై రూ.48,151 కోట్ల నికర లాభాన్ని గడించింది. ఆర్థిక ఫలితాల విడుదల సందర్భంగా మంగళవారం సమావేశమైన కంపెనీ బోర్డు..ప్రతి షేరుకు రూ.12 తుది డివిడెండ్‌ను అందిస్తున్నట్టు ప్రకటించింది. అలాగే పాలసీహోల్డర్లకు రూ.56,190 కోట్ల బోనస్ చెల్లింపులు జరపనున్నట్టు పేర్కొంది.

ఈ సందర్భంగా ఎల్ఐసీ ఎండీ, సీఈవో సిద్దార్థ మొహంతీ మాట్లాడుతూ.. గడిచిన ఆర్థిక సంవత్సరంలో సవాళ్లు ఉన్నప్పటికీ వృద్ధిని నమోదు చేసుకున్నట్టు, తొలి ఆరు నెలల్లో ఆశాజనక పనితీరు కనబరిచినట్టు చెప్పారు. పలు ఉత్పత్తులను మళ్లీ విడుదల చేయడం కలిసొచ్చిందన్నారు. హెల్త్‌కేర్ రంగంలోకి అడుగుపెట్టడంలో భాగంగా వాటా కొనుగోలుపై ఆయన స్పందిస్తూ..ప్రస్తుతం ఇది చర్చల దశలో ఉన్నదని, వచ్చే రెండు నుంచి మూడు నెలల్లో బోర్డు నిర్ణయం తీసుకుంటుందన్నారు.

## ఎన్ఎండీసీ ఆశాజనకం

న్యూఢిల్లీ, మే 27: ఎన్ఎండీసీ ఆశాజనక ఆర్థిక ఫలితాలు నమోదు చేసుకున్నది. 2024-25 ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికానికిగాను సంస్థ రూ.1,482 కోట్ల నికర లాభాన్ని గడించింది. ఇనుప ఖనిజం, పెల్లెట్లు అత్యధికంగా అమ్మకాలు నమోదు చేసుకోవడం వల్లనే లాభాల్లో రెండంకెల వృద్ధి నమోదైంది. కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 9 శాతం ఎగబాకి రూ.7,497.17 కోట్లకు చేరుకున్నది. వీటిలో ఇనుప ఖనిజం అమ్మకంతో రూ.6,350.49 కోట్ల నిధులు సమకూరగా, ఇతర మినరల్స్ విక్రయించడంతో రూ.662 కోట్ల నిధులు సమకూరాయి. రూపాయి ముఖ విలువ కలిగిన ప్రతిషేరుకు రూ.1 తుది డివిడెండ్‌ను బోర్డు ప్రతిపాదించింది.

# విదేశీ పెట్టుబడులు డౌన్

### జనవరి-మార్చి మధ్యకాలంలో 24 శాతం తగ్గుదల

న్యూఢిల్లీ, మే 27: విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఆకట్టుకోవడంలో కేంద్రం పూర్తిగా విఫలమవుతున్నది. గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఏడాది ప్రాతిపదికన 24.5 శాతం తగ్గి 9.34 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయని కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. 2023-24 ఏడాది ఇదే త్రైమాసికంలో భారత్‌లోకి 12.38 బిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు వచ్చాయి. అంతర్జాతీయ దేశాల ఆర్థిక అనిశ్చిత పరిస్థితులు నెలకొనడంతో దేశీయంగా పెట్టుబడులు పెట్టడానికి విదేశీ ఇన్వెస్టర్లు వెనుకంజవేస్తున్నారు. కానీ, 2024-25 ఆర్థిక సంవత్సం మొత్తానికి ఎఫ్‌డీఐలు 13 శాతం పెరిగి 50 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. సింగపూర్ నుంచి అత్యధికంగా 14.94 బిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐలు రాగా, మారిషస్ నుంచి 3.73 బిలియన్ డాలర్లు, అమెరికా నుంచి 5.45 బిలియన్ డాలర్లు, నెదర్లాండ్స్ నుంచి 4.62 బిలియన్ డాలర్లు, యూఏఈ నుంచి 3.12 బిలియన్ డాలర్లు, జపాన్ నుంచి 2.47 బిలియన్ డాలర్లు, బ్రిటన్ నుంచి 795 మిలియన్ డాలర్లు, జర్మనీ నుంచి 469 మిలియన్ డాలర్ల మేర ఎఫ్‌డీఐలు వచ్చాయి. మొత్తం ఎఫ్‌డీఐల్లో సింగపూర్ వాటా 30 శాతంగా ఉండగా, మారిషస్ వాటా 17 శాతం, అమెరికా వాటా 11 శాతంగా ఉన్నది. ట్రేడింగ్, టెలికాం, ఆటో, నాన్-కన్వెన్షనల్ ఎనర్జీ, కెమికల్స్ రంగాల్లోకి పెట్టుబడులు వచ్చాయి.

## నేడు చెక్కుల పంపిణీ

కృష్ణ, మే 27 : లబ్ధిదారులకు మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం ఉదయం కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేయనున్నట్లు తాసీల్దార్ పుష్పలత మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హాజరై కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే కేసులు

బాలానగర్‌లో తనిఖీ చేస్తున్న దృశ్యం

బాలానగర్, మే 27: ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా విత్తనాలు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై లెనిన్ హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని విత్తనాల విక్రయ కేంద్రాల్లో భూత్పూరు ఏవో అనిల్‌కుమార్‌తో కలిసి తనిఖీలు నిర్వహించారు. విత్తన విక్రయ కేంద్రాల్లో దస్త్రాలను పరిశీలించారు. విక్రయ రశీదులు, స్టాక్ రిజిస్టర్ల ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రస్తుత వ్యవసాయ సీజన్ లో విత్తన విక్రయ కేంద్రాల్లో నకిలీ విత్తనా లు, అనుమతి లేకుండా విత్తనాల విక్రయిస్తున్నట్లు సమాచారం మేరకు తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

**జడ్చర్లలో..**

జడ్చర్లటౌన్, మే 27: పట్టణంలోని విత్తన దుకాణాల్లో మంగళవారం టాస్క్‌ఫోర్స్ బృందం విస్తృత తనిఖీలు నిర్వహించింది. జడ్చర్ల, అడ్డాకుల ఏవోలు బ్యూలా, గోపీనాథ్, జడ్చర్ల ఎస్సై మల్లేశ్ ఆధ్వర్యంలో విత్తన దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా దుకాణా లైసెన్సులు, స్టాక్‌రిజిస్టర్లు, ఇన్వాయిస్, స్టాక్ బిల్స్‌ను పరిశీలించారు. విత్తనాల ప్యాకింగ్‌ను పరిశీలించారు. కల్తీ విత్తనాలు విక్రయిస్తే లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు. విత్తనాలను కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా కొనుగోలు రసీదు ఇవ్వాలని సూచించారు.

**నసుర్లాబాద్‌లో..**

జడ్చర్ల మండలంలోని నసుర్లాబాద్‌లో మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రై తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారులు మాట్లాడారు. ప్రభుత్వం నిషేధించిన విత్తనాల గురించి వివరిస్తూ వాటిని కొనుగోలు చేయొద్దని సూచించారు. హెచ్‌టీ (హెర్బీ సైడ్ టాలరెంట్) పత్తి విత్తనాలు వాడితే చర్మ సంబంధిత వ్యాధులతోపాటు నేల కాలుష్యం అవుతుందని, అంతేకాకుండా ఇతర పత్తివిత్తనాలను కలుషితం చేస్తాయన్నారు. ప్యాకింగ్ చేసిన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో గోపినాథ్, ఏఈవో సాయి కుమార్ పాల్గొన్నారు.

## లారీ ఢీకొన్ని వృద్ధుడు మృతి

మక్తల్, మే 27 : లారీ ఢీకొట్టిన ఘటనలో ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన మంగళవారం మక్తల్ మండల పరిధిలోని జక్లేర్ స్టేజి వద్ద చోటుచేసుకున్నది. ఎస్సై భాగ్యలక్ష్మి రెడ్డి కథనం మేరకు నర్వ మండలం రాజుపల్లికి చెందిన కొండారెడ్డి(65) మంగళవారం ఉదయం తన స్వగ్రామం నుంచి మక్తల్ మండలం జక్లేర్ గ్రామానికి పనిపై వచ్చాడు. నిత్యవసర సరుకులు తీసుకొని గ్రామానికి వెళ్లేందుకు జాతీయ రహదారి దాటుతున్న క్రమంలో కర్ణాటక రాష్ట్రం రాయచూర్ నుంచి మహబూబ్ నగర్‌కు వెళ్తున్న లారీ అతి వేగంగా వచ్చి కొండారెడ్డిని ఢీకొట్టింది. వృద్ధుడికి తీవ్ర గాయాలు కావడంతో గమనించిన జక్లేర్ గ్రామస్తులు 108 అంబులెన్స్‌లో ప్రథమ చికిత్స నిమిత్తం మక్తల్‌కు తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలోనే కొండారెడ్డి మృతి చెందాడు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం మక్తల్ ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

## ఇద్దరు పిల్లలతో సహా తల్లి అదృశ్యం

నవాబ్‌పేట, మే 27: ఇద్దరు పిల్లలతో కలిసి తల్లి అదృశ్యమైన ఘటన నవాబ్‌పేట మండల కేంద్రంలో ఈనెల 22వ తేదీన చోటు చేసుకున్నది. ఎస్సై విక్రమ్ కథనం ప్రకారం మండలంలోని కామారం గ్రామానికి చెందిన బంటు చెన్నయ్య కూతురు స్వప్నకు ఐదేండ్ల కిందట బోయపల్లికి చెందిన కొండయ్యతో వివాహమైంది. భార్యాభర్తల మధ్య గొడవల కారణంగా ఈనెల 18వ తేదీన స్వప్న తన ఇద్దరు పిల్లలను తీసుకొని బోయపల్లిలోని ఇంటి నుంచి వెళ్లి పోయింది. స్వప్న హైదరాబాద్‌లో ఉందన్న విషయం తెలుసుకున్న భర్త కొండయ్య అక్కడికి వెళ్లి ఈనెల 22న భార్యాపిల్లలను నవాబ్‌పేటకు తీసుకొచ్చాడు. నవాబ్‌పేట నుంచి స్వప్న తల్లిగారి ఊరైన కామారం గ్రామానికి వెళ్తానని చెప్పింది. అక్కడి నుంచి కామారం వెళ్లలేదని, కామారంతోపాటు ఇతర ప్రాంతాల్లో స్వప్న, పిల్లల ఆచూకీ కోసం భర్త వెతకగా లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు. కొండయ్య ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

## పగిలిన పైపులైన్ నిలిచిన సరఫరా

• వృథాగా పారుతున్న నీరు • పట్టించుకోని అధికారులు

పగిలిన పైపు వద్ద వృథాగా వెళ్తున్న నీరు

ధన్వాడ, మే 27: బీఆర్ఎస్ హయాంలో ఇంటింటికీ తాగునీటిని అందించి దాహార్తి తీర్చేందుకు మాజీ సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా మిషన్ భగీరథ పథకాన్ని చేపట్టారు. అయితే మండలంలోని రామకిష్టాపల్లి శివారులో రోడ్డు మరమ్మతు పనులు చేపడుతుండగా.. పైప్‌లైన్ పగిలి ప్రజల దాహాన్ని తీర్చాల్సిన నీరు వృథాగా నేలపాలవుతున్నది. ప్రజాపాలన ప్రభుత్వంలో అధికారులు ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారింది. మిషన్ భగీరథ పైప్‌లైన్ మరమ్మతు చేపట్టాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పైపు పగిలిపోవడంతో కొండాపూర్ తదితర గ్రామాలకు మంచినీటి సమస్య ఏర్పడుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైపునకు మరమ్మతు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# అన్ని గ్రామాలు అభివృద్ధి చెందాలి

• ఎమ్మెల్యే విజయుడు

బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే

అలంపూర్ చౌరస్తా, మే 27 : అలంపూర్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. మంగళవారం రాజోళి మండలంలోని పచ్చర్ల గ్రామానికి చెందిన మేడికొండ సుబ్బమ్మకు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.16,500ల చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు, అలాగే టీగార్లపాడు గ్రామానికి చెందిన సరస్వతమ్మ రూ.12వేల చెక్కును అందజేశారు. అదేవిధంగా బీఆర్ఎస్ పార్టీ యువజన నాయకుడు కిశోర్ తల్లి మరియమ్మకు కాలుకి ఆపరేషన్ కావడంతో కర్నూల్‌లోని ఆదిత్య దవాఖానకు ఎమ్మెల్యే విజయుడు వెళ్లి బాధితురాలిని పరామర్శించారు. అలాగే కర్నూలో శ్రీచక్ర దవాఖానలో ఉండవెల్లి మండలం పుల్లూరు గ్రామానికి చెందిన దేవికారాణికి ఆపరేషన్ కావడంతో ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## వేతనాలు చెల్లించాలి

నారాయణపేట టౌన్, మే 27: ప్రభుత్వ హాస్టళ్లల్లో పనిచేసే కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల 6నెలల పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రాం డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని కలెక్టరేట్‌లో ఏవో జయసుధకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇచ్చే అరకొర వేతనం నెలలుగా పెండింగ్‌లో ఉంచడంతో కార్మికులు అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ప్రతినెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, లక్ష్మమ్మ, లక్ష్మి ఉన్నారు.

## తీర్థయాత్రలకు ప్రత్యేక రైళ్లు

గద్వాల అర్బన్, మే 27 : తీర్థయాత్రలకు వెళ్లే వారి కోసం రైల్వే శాఖ ప్ర త్యేక రైళ్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. తెలుగురాష్ట్రాల ప్రజలకోసం జూన్ 14 నుంచి జూలై 13వ తేదీ వర కు రెండు ప్యాకేజీలుగా ప్రత్యేక రైళ్ల ను హైదరాబాద్ నుంచి ప్రారంభిస్తున్న ట్లు ఐఆర్‌సీటీసీ టూరిజం జాయింట్ జ న రల్ మేనేజర్ డీఎస్‌జీపీ కిశోర్ మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. ప్యాకే జి 1 (గంగా రామాయణ పుణ్య క్షేత్ర యాత్ర-ఎస్‌సీజెడ్‌బీజీ44) ఈ యాత్రలో (కాశీ)వారణాసి, అయోధ్య, నైమిశారణ్య, ప్రయాగ్‌రాజ్, శృంగవర్పూర్ తదితర ప్రాంతాలను దర్శించుకోవచ్చ ని తెలిపారు. ఈ యాత్ర జూన్ 14వ తేదీన ప్రారంభమై 22వ తేదీ వరకు ఉంటుందన్నారు. దీనికి ఒక్కరికీ సాధారణ టికెట్ ధర రూ.16,200, ఏసీ3 ధ ర రూ.26,500, ఏసీ2 ధర రూ.35వే లు ఉంటుందన్నారు. సికింద్రాబాద్, భువనగిరి, జనగాం, కాజీపేట, వరంగ ల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖ మ్మం, మధిర, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, తుని, దు వ్వాడ, పెందుర్తి, విజయనగరం, పలా స, బరంపూర్, భువనేశ్వర్ మీదుగా వె ళ్తుందన్నారు. అలాగే ప్యాకేజి 2 (ఐదు జ్యోతిర్లింగ యాత్ర-ఎస్‌సీజెడ్‌బీజీ-4 3) ఉజ్జయిని(మహాకాళేశ్వర్-ఓంకారేశ్వర్), త్రయంబకేశ్వర్, భీంశంకర్, ఘృ ష్ణేశ్వర్, ఎల్లోరా, మోవ్, నాగ్పూర్ తదితర ప్రాంతాలు సందర్శించుకోవచ్చని పేర్కొన్నారు. జూలై 5వ తేదీన మొదలై 13వ తేదీ వరకు ఉంటుందని తెలిపా రు. ఒక్కొక్కరికీ సాధారణ టికెట్ రూ.14,700, ఏసీ3 ధర రూ.22,900, ఏసీ 2 రూ.29,900 ధర ఉంటుందని పేర్కొన్నారు. యాత్ర సికింద్రాబాద్, కామారెడ్డి, నిజామాబాద్, ధర్మాబాద్, నాందేడు, ముద్ఖడ్, పూర్ణమీదుగా వెళ్తుందన్నారు. యాత్రలో రైలు మొదలుకొని బస్సు హోటల్ (ఉదయం, మధ్యాహ్నం, రాత్రి) భోజన వసతి వాటర్, బాటిల్, టూర్‌ఎస్కాట్ సేవలతో సందర్శనా స్థలాలు తిరగవచ్చన్నారు. అలాగే ప్రయాణ బీమా, ఇన్సూరెన్స్ అలాగే రైల్వేస్టేషన్ నుంచి ఆలయాలకు ప్రయాణం పూర్తిగా ఉచితంగా ఉంటుందన్నారు. ప్రతిరైల్‌లో 718మంది ప్రయాణికులు వెళ్తారని, ప్రతి 70మందికి ఇద్దరు కోర్డినేటర్లు అందుబాటులో ఉండి అన్ని సౌకర్యాలు సమకూరుస్తారని పేర్కొన్నారు. టికెట్‌బుక్ చేసుకోవాలం టే 9701360701, 92810 3071 2, 9281495845, 928103 074 9, 9281030750 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

# రాష్ట్రస్థాయిలో సత్తా చాటాలి

రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులతో ఎస్సై వెంకటేశ్వర్లు

నారాయణపేట, మే 27: క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో సత్తా చాటాలని ఎస్సై వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం పట్టణంలోని మినీ స్టేడియంలో 11వ తెలంగాణ స్టేట్ సబ్ జూనియర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్సై వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించి మాట్లాడారు. అండర్-8, 10, 12 విభాగాల్లో బాలబాలికలకు రన్నింగ్, టెన్నీస్, బాల్‌త్రో, స్టాండింగ్ బ్రాడ్ జంప్, లాంగ్ జంప్, కిడ్స్ జావెలిన్‌త్రో, షాట్‌పుట్ తదితర పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. పోటీల్లో మొత్తం 120 మంది క్రీడాకారులు పాల్గొనగా.. 25మంది రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు జూన్ 1న సికింద్రాబాద్‌లోని జింఖానా గ్రౌండ్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. అనంతరం గెలుపొందిన క్రీడాకారులకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ, లయన్స్ క్లబ్ నారాయణపేట టౌన్ ప్రెసిడెంట్ రఘు బాబు, ఖేలో ఇండియా ఖోచ్ హరికాదేవి, పీఈటీలు రమేశ్, మహేశ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# సుందరకాండ పారాయణంతో భక్తిభావం

సుందరకాండ ప్రవచనాలను వివరిస్తున్న దీక్షితుల సుబ్రహ్మణ్యం

జడ్చర్లటౌన్, మే 27: సుందరకాండ పారాయణంతో ప్రతి మనిషిలో భక్తిభావన పెంపొందించవచ్చని దీక్షితుల సుబ్రహ్మణ్యం అన్నారు. కావేరమ్మపేట చంద్రమౌళి ఈశ్వరస్వామి ఆలయంలో పోల వెంకయ్య ఆధ్వర్యంలో మంగళవారం సుందరకాండ తెలుగు వచనం పారాయణం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవచనకర్త దీక్షితుల సుబ్రహ్మణ్యం పాల్గొని పారాయణం ఉద్దేశించి వివరించారు. తెలుగు వచనం పారాయణంతో భూతపిచాచ గ్రహదోషాలను నివారించి అభయ ఆరోగ్య వంశ అభివృద్ధి అనుగ్రహం పొందవచ్చన్నారు. ఈ సందర్భంగా సుందరకాండ పారాయణ ప్రవచనాలను సంబోధించారు. అంతకుముందు స్థానిక అంబభవానీ ఆలయం నుంచి ఆంజనేయస్వామి ఆలయం వరకు సీతారాముడి ఊరేగింపు నిర్వహించారు. అలాగే ఆలయంలో 11,116 తమలపాకులతో ఆకుపూజ ఆకులతో సీతారాముడికి అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో పోల రవీందర్, విజయ్, శివ, శ్రీనివాసులు, జగదీశ్, చెన్నయ్య, బుక్క వెంకటేశ్, నారాయణ, మహేశ్, లక్ష్మయ్య, లావణ్య, సుమతి, గోనెల రాధాకృష్ణ, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వేధిస్తే కఠిన చర్యలు

మక్తల్, మే 27 : ఆకతాయిలు అమ్మాయిలను వేధిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని షీటీం పోలీసులు పేర్కొన్నారు. ఎస్పీ యోగేశ్‌గౌతమ్ ఆదేశాల మేరకు మంగళవారం మక్తల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సామాజిక అంశాలపై శిక్షణ ను అందించారు. ఈ సందర్భంగా షీటీం పో లీస్ బాలరాజు మాట్లాడుతూ కళాశాలకు వ చ్చే సమయంలో ఎవరైనా అమ్మాయిలను వేధిస్తే వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు స మాచారం అందించాలని సూచించారు. అదేవిధంగా ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, డ్రగ్స్, గం జాయి, ట్రాఫిక్ చట్టాలు, సెల్ ఫోన్ వినియోగంతో ఏర్పడే అనర్థాలు, పోటీ పరీక్షల్లో వి ద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, లీడర్‌షిప్ లక్షణాలు తదితర అంశాలపై విద్యార్థులకు అ వగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి ఇష్టంతో చదువుకుంటే భవిష్యత్తులో ఉన్నతమైన శిఖరాలకు చేరుకుంటారన్నారు. ఎవరైనా అమ్మాయిలను వేధింపులకు గురైతే 8712670398 నెంబర్‌కి సమాచార ఇవ్వ ఉన్నారు. కార్యక్రమంలో షీటీం పోలీసులు ఉన్నారు.